నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | బుధవారం 24 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD





# అసెంబ్లీకి ఎమ్మెల్యేలు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మంగళ వారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు సమావేశాలకు ఆసిఫాబాద్, ఖానాపూర్, కాగజ్‌నగర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీశ్‌బాబు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## ఆసిఫాబాద్‌కు నయా పైసా ఇవ్వలేదు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 23: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలైనా ఇప్పటి వరకు ఆసిఫాబాద్ నియోజకవర్గానికి నయా పైసా ఇవ్వలేదని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా ఇవ్వడం లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు వెళ్తూ హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యేలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేస్తే వాటిని నియోజకవర్గానికి ఇవ్వకుండా ఆపుతున్నారని దీంతో గ్రామ పంచాయతీల్లో కనీసం పారిశుధ్య పనులకు కూడా నోచుకోవడం లేదన్నారు. తన సొంత ఖర్చులతో రెండు, మూడు గ్రామ పంచాయతీలకు పారిశుధ్య నిర్వహణకు నిధులు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి నియోజకవర్గంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 23 : అర్హులైన రైతులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా రుణమాఫీ అమలు చేయాలని బ్యాంకు అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును సందర్శించి రుణమాఫీ పథకం నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడారు. బ్యాంకు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ పథకం అమలు మొదటి విడుతలో భాగంగా లక్ష రూపాయల లోపు రుణం రైతుల ఖాతాలలో నిధులు జమ చేయాలన్నారు. ఎలాంటి షరతులు విధించకుండా నిబంధనల మేరకు రుణ మొత్తాన్ని రైతులకు చెల్లించాలని ఆదేశించారు. రుణమాఫీ పథకాన్ని జిల్లాలో అర్హులైన రైతులందరికీ వర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వీ జోషి, ఆసిఫాబాద్ తహసీల్దార్ దేశ్‌పాండే, బ్యాంకు మేనేజర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎంపీల వైఫల్యం



బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మొండిచేయి చూపింది. రాష్ట్రానికి నిధులు తీసుకురావడంతో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక విభజన హామీల పేరిట ఏపీకి రూ.15 వేల కోట్లు ఇచ్చినప్పుడు, కొత్తగా ఏర్పడిన మన రాష్ట్రానికి ఎందుకు ఇవ్వలేదు. బీహార్ రాష్ట్రానికి వరద నివారణ పేరిట రూ.11,500 కోట్లు ఇచ్చారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి అంత మొత్తంలో నిధుల అవసరం ఉంది. అలా నిధులిస్తే మంచిర్యాల ముంపు ప్రాంత ప్రజలకు మేలు జరిగేది. కానీ.. మనకు ఇవ్వలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు డబ్బులు ఇచ్చి మన రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు ఇవ్వలేదు. జాతీయ రహదారుల కోసం కేంద్ర కేటాయించిన రూ.24 వేల కోట్లతో తెలంగాణకు ఎక్కువ నిధులు తేవాల్సిన బాధ్యత ఇప్పుడున్న ఎంపీలపై ఉంది. ఏదీ ఏమైనా ఈ బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగింది.

*- నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల.*




# కరుణించని కేంద్రం

## సెంట్రల్ బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేదు..

- రాష్ట్రానికి పైసా కూడా విదల్చని మోదీ సర్కారు
- సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపులు లేవు
- పెండింగ్‌లోనే ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్
- సీసీఐ, హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్ ఏర్పాటు వాయిదా పడినట్లే..
- గంపెడాశలు పెట్టుకున్న ఉమ్మడి జిల్లా వాసులకు మిగిలింది నిరాశే..

మంచిర్యాల, జూలై 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి నిర్మలమ్మ బడ్జెట్ ప్రసంగంలో అసలు తెలంగాణ ప్రస్తావనే రాలేదు. కేంద్ర మంత్రి నిర్మ లా సీతారామన్ రూ.48.20 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మనకు పైసా విదల్చలేదు. దీంతో ఎప్పటిలాగే కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న రాష్ట్ర ప్రజలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులకు మరోసారి నిరాశే మిగిలింది. ప్రతిసారి కొన్ని రాష్ట్రాలకే బడ్జెట్‌ను పరిమితం చేసే కేంద్ర ప్రభుత్వం ఈసారి కూడా అదే చేసింది. మిత్ర పక్షాలున్న రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు భారీ కేటాయింపులు చేసింది. బడ్జెట్ సొమ్ము మొత్తాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు, మిత్ర పక్షాలున్న రాష్ట్రాలకే ఊడ్చి పెట్టింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏళ్లుగా పేరుకుపోయిన పెం డింగ్ పనులకు ఈసారైన మోక్షం దక్కలేదు. జిల్లావాసుల ఎదురుచూపులు ఫలించలేదు. రాష్ట్రం నుంచి 8మంది బీజే పీ ఎంపీలను గెలిపిస్తే అందులో ఒకరు ఆదిలాబాద్ నుంచి గెలిచారు. దీంతో ఈసారి ఆదిలాబాద్‌కు నిధులు పక్కాగా వస్తాయనే అంచనా వేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలే దు. కేంద్రం ప్రభుత్వం జిల్లా విషయంలో మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కేంద్ర పరిధిలోని ప్రాజెక్టులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న వాటికి కూడా నిధులు కేటాయించలేదు. రెండోసారి ఆదిలాబాద్‌లో బీజేపీ ఎంపీని గెలిపించినా కేంద్రం జిల్లా అభివృద్ధిని పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సింగరేణికి పన్ను మినహాయింపు లేదు..

సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను(ఐటీ)లో మినహాయింపుపై ఈసారి కచ్చితంగా అనుకూల ప్రకటన వస్తుందనుకున్నారు. బడ్జెట్‌లో ఇందుకోసం ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని భావించారు. ఇప్పటికే కేంద్రం బొగ్గు గనుల ప్రైవేటీకరణకు టెండర్లు పిలుస్తుంది. సింగరేణి కార్మికులకు అన్యాయం జరుగుతుందనే భావన అందరిలోనూ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పన్ను మినహాయింపు కల్పించి కాస్త ఊరట కల్పిస్తుందనుకుంటే మరోసారి నిరాశే ఎదురైందని కార్మికులు మండిపడుతున్నారు. ఏళ్లుగా ఉన్న డిమాండ్‌ను ఈసారి కూడా పరిగణలోకి తీసుకోకపోవడంపై పెదవి విరుస్తున్నారు. సింగరేణిని నాశనం చేయాలన్న ఆలోచనతోనే మోదీ సర్కార్ ఉందని, అందుకే కార్మికుల సంక్షేమాన్ని ప ట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతంగా ఉత్తర, దక్షిణ భారతదేశానికి రవాణ మార్గంగా ఉన్న మంచిర్యాల మీదు రైళ్ల రవాణాను మెరుగుపరచాల్సి ఉంది. ఈ మేరకు రైళ్ల హాల్టింగ్‌లను పెంచి నూ తన ఆర్‌వోబీలు, అండర్ బ్రిడ్జిలు పెంచితే రోడ్డు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కానీ.. ఈసారి కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోలేదు. ఇక జిల్లా నుంచి వెళ్తున్న జాతీయ రహదారులు సహా అటవీ, పర్యావరణ అనుమతులు లేక అనేక గ్రామాల్లో రోడ్లు లేవు. కోటపల్లి, వేమనపల్లి, జన్నా రం, చెన్నూర్, ఆసిఫాబాద్ జిల్లాల్లో చాలా గ్రామాల్లో రోడ్లు లేక జనాలు అవస్థలు పడుతున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఈ రోడ్ల నిర్మాణానికి కావాల్సిన అనుమతుల విషయంలో కేంద్రం చొరవ చూపుతుందనుకుంటే అది జరగలేదు.

### ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వే లైన్‌కు నిధులేవు..

పాత జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు రైలులో పోవాలంటే మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇందుకు గానూ 9 నుంచి 10 గంటల సమయం పడుతుంది. జిల్లా ప్రజలు రైలులో నగరానికి పోయేందుకు కేంద్రం ఏర్పాటుకు 2009-10 రైల్వే బడ్జెట్‌లో ఆదిలాబాద్ నుంచి పటాన్చెరు వరకు లైన్ మంజూరు చేసింది. నిర్మాణ వ్యయం రూ.3771 కోట్లు భారీగా అవుతుండడంతో తక్కువ ఖర్చుతో ఆర్మూర్ లైన్‌ను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆర్మూర్ వరకు లైన్ వేస్తే అక్కడి నుంచి నిజామాబాద్ మీదుగా హైదరాబాద్‌కు రైలులో పోయే అవకాశాలున్నాయి. దీంతో 2017 బడ్జెట్‌లో ఆదిలాబాద్-ఆర్మూర్ లైన్‌కు మంజూరు లభించింది.

లైన్ సర్వే నిర్వహించిన అధికారులు రూ.2990 కోట్లు ఖర్చవుతాయని అంచనాలు వేశారు. ఈ రైల్వే లైన్‌కు కేంద్రం నిధులు కేటాయిస్తుందని జిల్లావాసులు ప్రతి బడ్జెట్‌లో ఎదురు చూస్తున్న నిరాశే కలుగుతుంది. ఈ బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రైల్వేలైన్ విషయంలో ఊసేత్తలేదు.

### సీసీఐ ఊసే లేదు..

మూతపడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను పునః ప్రారంభించడానికి అన్ని అవకాశాలున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుంది. ప్రస్తుతం సిమెంటు రంగానికి మంచి డిమాండ్ ఉండగా పరిశ్రమ ప్రారంభానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. జాతీయ రహదారి 44కు సమీపంలో పరిశ్రమ భూములు, సిమెంటును తరలించడానికి ఆదిలాబాద్ నుంచి రైలు, మహారాష్ట్రతోపాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు రోడ్డు మార్గం ఉంది. 772 ఎకరాల భూములు, 170 ఎకరాల్లో టౌన్‌షిప్, 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌తోపాటు నీటి వనరులు ఉన్నాయి. సిమెంటు తయారీకి అపారమైన వనరులు ఉన్నా కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వీడనాడడం లేదు. సిమెంటు పరిశ్రమను ప్రారంభించాలని అఖిలపక్షం నాయకులు ఆందోళనలు చేసినా ఫలితం లేదు. గతంలో కేంద్ర మంత్రులు అమిత్‌షా, హన్స్‌రాజ్ గంగారాంలు సీసీఐని ప్రారంభిస్తామని హామీలు ఇచ్చినా ఫలితం లేదు. ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. ఉడాన్ పథకం కింద ద్వితీయ శ్రేణి నగరాలకు విమానాలను నడిపేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్‌లో సైతం విమానాశ్రయం ఏర్పాటుకు అవకాశాలున్నాయని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియాను కోరింది. జిల్లాలో పర్యటించిన అధికారుల బృందం ఎయిర్‌పోర్టు మైదానాన్ని పరిశీలించి సానుకూలంగా నివేదికలు అందజేసింది. కానీ.. విషయాన్ని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. హైదరాబాద్- ఆదిలాబాద్ జాతీయ రహదారి జిల్లాలో 80 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నేషనల్ హైవేకు ఇరువైపుల ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. జిల్లాలో ముడిసరుకు లభ్యమయ్యే వస్త్ర, వివిధ రకాల పంటల ఉత్పత్తులు, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంది. ఇది వస్తే ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతుంది. కానీ.. కారిడార్ ఏర్పాటును కేంద్ర మంత్రి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కీలక హామీలను నెరవేర్చుకునే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేయకపోవడంపై పలు వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## బీజేపీ, కాంగ్రెస్‌లు మోసం చేశాయి



శ్రీరాంపూర్, జూలై 23 : సింగరేణి కార్మికులకు ఐటీ రద్దు చేయిస్తామని మాయ మాటలు చెప్పిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మోసం చేశాయి. 2024-25 బడ్జెట్ సమావేశంలో నామమాత్రంగా ఆదాయపు పన్ను స్లాబ్‌లను సవరించాయి. కార్మికుల 12 నెలల వేతనాల్లో మూడు నెలల వేతనాలు ఆదాయపు పన్ను కోతకే సరిపోతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పార్లమెంటులో కనీసం గళం ఎత్తకపోవడం విడ్డూరం.

*- సురేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి.*

## కార్మికులకు ఒరిగింది ఏమి లేదు..



రెబ్బెన, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సింగరేణి కార్మికులకు ఒరిగింది ఏమి లేదు. ఆదాయపన్నును మినహాయిస్తారనుకుంటే మళ్లీ నిరాశే మిగిలింది. అంకెల గారడీ చేసి పన్ను స్లాబులు అటుది ఇటుగా ఇటుది అటుగా మార్చడం తప్పా ఏ ఒక్క కార్మికుడికి కూడా రూపాయి తగ్గదు. ఈ విషయంపై టీబీజీకేఎస్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుంది.

*- మల్రాజు శ్రీనివాసరావు, టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు.*









ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం

## ఎల్లంపల్లికి వరద తాకిడి

హాజీపూర్, జూలై 23 :మండలంలోని గుడిపేట శివారులో నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టు క్రస్ట్ లెవల్ 148 మీటర్లకు గాను 143.93కి చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 కాగా 12.1308 టీఎంసీలకు చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో 11229 క్యూ సెక్కుల వరద వచ్చి ప్రాజెక్టులో చేరుతుండగా హైదరాబాద్ తాగునీటికి 331 క్యూ సెక్కుల నీటిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# రోడ్లకు మరమ్మతులు చేయాలి

- రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి
- అధికారులకు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం



కోటపల్లి : అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, జూలై 22 : భారీ వర్షాల కారణంగా ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లికి వెళ్లేదారిలో ఉన్న లోత్‌ఒర్రె లోలెవల్ వంతెన ధ్వంసం కాగా కలెక్టర్ పరిశీలించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. ధ్వంసమైన రహదారులు, వంతెనలకు మరమ్మతు చేయాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కోటపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం, తహసీల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. హాజరు రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించాలన్నారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వార్డులను పరిశీలించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, నక్కలపల్లి పంచాయతీ కార్యదర్శి మద్ది శివకృష్ణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరదలపై అప్రమత్తంగా ఉండాలి

**-రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్**

కోటపల్లి, జూలై 22 : ప్రాణహిత, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కోటపల్లి మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు వంతెన, అర్జున్ గుట్ట వద్ద ఉన్న ఫెర్రి పాయింట్‌ను ఆయన పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. సహాయక చర్యల కోసం బోట్, వివిధ రక్షణ పరికరాల ద్వారా కూడిన డీడీఆర్‌ఎఫ్ (డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) పోలీసు టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏవైనా ఇబ్బందులుంటే డయల్ 100 కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘువేంద్ర రావు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తదితరులు ఉన్నారు.

